క్లుప్తంగా

మందాలమ్మకు వెండి సమర్పణ



వడలి మందాలమ్మకు వెండి సమర్పిస్తున్న దాతలు

పెనుగొండ: వడలి గ్రామ దేవత మందాలమ్మకు వెండి కవచాలు ఇతర వస్తువులు తయారీకి పెరవలి మండలం మల్లేశ్వరం గ్రామానికి చెందిన నల్లం వెంకటేశ్వరరావు, సాయి రమాదేవి దంపతులు రూ.10 వేలు విలువైన 100 గ్రాముల వెండిని సమర్పించారు. వెండిని కమిటీ సభ్యులు ఉప్పల పాటి చంటికి సోమవారం అందించారు. ఆలయాభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వాసుపత్రికి దుప్పట్ల వితరణ



దుప్పట్లను అందిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: సంధ్య మెరైన్స్, పూలపల్లి ఆధ్వర్యంలో పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి రూ.15వేలు విలువైన 50 దుప్పట్లు వితరణ చేశారు. సోమవారం ఈ దుప్పట్లను ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.ఓ రవికుమార్‌కి సంధ్య మెరైన్స్ హెచ్‌ఆర్ ఏడుకొండలు, వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి హెడ్ నర్సు పి.పద్మజ, ఎన్.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మణికాంత్ గౌడ్‌కు ఉత్తమ పురస్కారం



మణికాంత్ గౌడ్ ప్రశంసాపత్రం షీల్డు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణి

పాలకొల్లు అర్బన్: పట్టణానికి చెందిన స్నేక్ స్నేచర్, నెస్ట్ కన్జర్వేషన్ సొసైటీ చైర్మన్ మణికాంత్ గౌడ్ జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణి చేతుల మీదుగా ప్రశంసాపత్రం, షీల్డు అందుకున్నారు. సొసైటీ తరపున పశు సంక్షేమం, ప్రకృతి పరిరక్షణ, సమాజానికి గత కొంతకాలంగా మణికాంత్ గౌడ్ చేస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించింది. ఇటీవల తణుకులో సంచరిస్తున్న అతిపెద్ద కొండచిలువను మణికాంత్ గౌడ్ అత్యంత చాకచక్యంగా పట్టుకుని నల్లజర్ల అడవుల్లో వదిలారు. నెస్ట్ కన్జర్వేషన్ సొసైటీ టీమ్ సభ్యులను జిల్లా కలెక్టర్ నాగరాణి ప్రత్యేకంగా అభినందించారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



ములపర్రులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పెనుగొండ: ములపర్రులో సోమవారం సంవిధాన్ గౌరవ అభియాన్ బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు దొడ్డిపట్ల నాగూర్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితంతో ముడిపడి ఉన్న ఐదు స్థలాలను కేంద్ర ప్రభుత్వం పంచతంత్ర పేరుతో అభివృద్ధి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆచంట అసెంబ్లీ కన్వీనరు కర్రి ప్రసాద రెడ్డి, ఉటాల చంటి, బిరుదకోట సుబ్రహ్మణ్యం మానేపల్లి పురుషోత్తం పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



పెనుగొండ వాసవీ శాంతి థాంను పరిశీలిస్తున్న ఎస్పీ బృందం

పెనుగొండ: పెనుగొండలో వాసవీ కన్యకపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 31న ముఖ్యమంత్రి చంద్రబాబు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించనుండడంతో జిల్లా అధికారులు ఏర్పాట్లు పరిశీలించారు. సోమవారం వాసవీ శాంతిధాంలో చేయాల్సిన ఏర్పాట్లు, ఏఎంసీలో హెలీపాడ్ ప్రాంతాన్ని పరిశీలించారు. పరిశీలనలో జాయింట్ కలెక్టర్ కె.రాహుల్‌కుమార్ రెడ్డి, ఎస్పీ నయీం అస్మీ, ఆర్డీఓ దాసి రాజు, తహసీల్దారు జి.అనితకుమారి, డీఎస్పీ డాక్టర్ శ్రీ వేద పాల్గొన్నారు.

యువకుడిపై కేసు నమోదు

ఉండి: ప్రేమ పేరుతో యువతిని మోసగించిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం ఉండి మండలం కోలమూరు గ్రామానికి చెందిన యువతిని అదే గ్రామానికి చెందిన ప్రశాంత్ ప్రేమిస్తున్నానంటూ వెంటపడ్డాడు. అనంతరం ఆమెకు ముఖం చాటేయడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.

అంతర్గత రహదారుల అభివృద్ధిపై నిర్లక్ష్యం

- లింకురోడ్లు లేక పట్టణ వాసుల అవస్థలు
- దశల వారీగా రోడ్లు నిర్మించాలని గతంలో పాలకవర్గం నిర్ణయం
- ప్రభుత్వం మారిన తర్వాత పట్టించుకోని వైనం



31వ వార్డు చినమామిడిపల్లిలో ఓఎన్‌జీసీ కాలనీలో సగం పూర్తిచేసి వదిలేసిన అప్రోచ్ రోడ్డు

నరసాపురం: పట్టణంలో పలు వార్డుల్లో అప్రోచ్ రోడ్ల నిర్మాణాలు జరగకపోవడంతో ఆయా ప్రాంతాల వారు నానా ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ హయాంలో ప్రస్తుత పాలకవర్గం రెండేళ్ల క్రితం పట్టణంలో అంతర్గత రహదారులను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. దశలవారీగా పనులు చేపట్టాలని ప్రయత్నం చేశారు. అయితే ప్రభుత్వం మారిన తరువాత ఈ అంశాన్ని అస్సలు పట్టించుకోవడం మానేశారు. దీంతో ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్య అసలు తీరుతుందో? లేదోనని ప్రజలు వాపోతున్నారు. నరసాపురం మున్సిపాలిటీలో అంతర్గత రోడ్ల నిర్మాణం విషయంలో గతం నుంచి తీవ్ర నిర్లక్ష్యం జరిగింది. ప్రధాన రహదారులను తప్పిస్తే, కాలనీల్లో అప్రోచ్ రోడ్లను నిర్మించలేదు. ఫలితంగా స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆఖరుకు భారీగా నిధులు వచ్చి పడ్డ 2014 పుష్కరాల సమయంలో కూడా వార్డుల్లో ప్రజలు మొరపెట్టుకున్నా గత పురపాలకులు ఈ సమస్యను పట్టించుకోలేదు.

ఎన్నో ఇబ్బందులు

పట్టణంలో చినమామిడిపల్లిలో ఓఎన్జీసీ కానీలో పూర్తిస్థాయిలో రోడ్లు నిర్మించారు. కానీ కాలనీ నుంచి ప్రధాన రోడ్డుకు చేరుకోవడానికి అప్రోచ్‌రోడ్లు లేవు. దీంతో మట్టిదిబ్బలను దాటుకుంటూనే వెళ్లాల్సిన పరస్థితి. ఎన్టీఆర్ కాలనీ, నందమూరు కాలనీ, వైఎస్సార్ నగర్, స్టేషన్‌పేట, గ్రేస్‌నగర్, పొన్నపల్లి ప్రాంతాల్లో ఇలాంటి ఇబ్బందులు అధికంగా ఉన్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో జనం నానా అవస్థలు పడుతున్నారు. దళితులు, పేదలు ఎక్కువగా ఉండే 27,28 వార్డుల్లోనూ, మున్సిపాలిటీ మురికివాడలుగా గుర్తించిన అరుందతిపేట, మాధవాయిపాలెం ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి. వీటన్నంటినీ దశలవారీగా నిర్మించాలని ఎన్నికలకు ముందు మున్సిపల్ పాలకవర్గం భావించింది. అయితే ఎన్నికల తరువాత పాలకవర్గం ఈ అంశాన్ని పట్టించుకోవడంలేదు.

అప్రోచ్ రోడ్ల సమస్య ఉంది



ప్రజలు ఎక్కువగా అప్రోచ్ రోడ్లు నిర్మించాలని తరచూ కోరుతున్నారు. అప్రోచ్ రోడ్లు లేక పోవడంతో ముఖ్యంగా వర్షాకాలంలో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. సమస్య తీవ్రంగా ఉంది. పట్టణంలో నిర్మించాల్సిన అప్రోచ్ రోడ్లు 5 కిలో మీటర్లు వరకూ ఉంటాయని అంచనావేశాం. ఎక్కడెక్కడ రోడ్లు నిర్మించా లనే అంశాన్ని కూడా గుర్తించాం. కొన్ని ప్రాంతాల్లో అప్రోచ్‌రోడ్లు నిర్మాణం చేపట్టాం.అయితే ప్రభుత్వం మారిన తర్వాత ఇబ్బంది వచ్చింది. అప్రోచ్ రోడ్ల నిర్మాణాలపై కచ్చితంగా దృష్టి పెడతాం.

– బర్రి శ్రీవెంకటరమణ, మునిసిపల్ చైర్‌పర్సన్

పట్టణంలో రోడ్ల సమాచారం

సీసీ రోడ్లు	31.52 కిలోమీటర్లు
బీటీ రోడ్లు	15.65 కిలోమీటర్లు
కంకర రోడ్లు	7 కిలోమీటర్లు
కచ్చా రోడ్లు	2 కిలోమీటర్లు

ప్రజల ఫిర్యాదులపై తక్షణం చర్యలు చేపట్టాలి



ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న ఆర్డీఓ దాసి రాజు

నరసాపురం: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణం చర్యలు తీసుకోవాలని నరసాపురం ఆర్డీవో దాసి రాజు అధికారులను ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమాన్ని ఆర్డీఓ దాసి రాజు నిర్వహించారు. డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఫిర్యాదులు, దరఖాస్తులు అందించారు. మొత్తం 26 ఫిర్యాదులు అందినట్టు ఆర్డీవో తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. దరఖాస్తులకు సంబంధించి సమస్యల పరిష్కారం ఎంతవరకూ వచ్చిందనే అంశాన్ని ఎప్పటికప్పుడు తనకు నివేదిక ఇవ్వాలని తహసీల్దార్లను ఆదేశించారు. ప్రజల అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాడి రైతులు పాల దిగుబడి పెంచుకోవాలి



మునమర్రులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రమీలారాణి

పెనుగొండ: ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని పాల దిగుబడిని పెంచుకోవాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఏడీఏ డాక్టర్ ఎం.ప్రమీలారాణి అన్నారు. సోమవారం పెనుగొండ మండలం సోమరాజు చెరువు, మునమర్రుల్లో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాల్లో పాల్గొని పశువైద్య పరీక్షలు నిర్వహించారు. నట్టల టీకాలు, ఇతర టీకాలు సకాలంలో వేయించుకోవాలని సూచించారు. పాల దిగుబడి పెంచుకోవడం వల్ల కుటుంబ అభివృద్ధి జరుగుతుందన్నారు. సోమరాజు చెరువులో సిద్ధాంతం పశువైద్యాధికారి కె.భాను తేజ ఆధ్వర్యంలో 35 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించగా వైస్ ఎంపీపీ తోలేటి శ్రీను, సర్పంచ్ దంపనబోయిన రూపవతి, మానేపల్లి శ్రీను, ఆకుల సుబ్బయ్య, దంపనబోయిన మోహనకృష్ణ పాల్గొన్నారు. మునమర్రులో జరిగిన శిబిరంలో డాక్టర్ ప్రమీలారాణి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దంపనబోయిన మోహన కృష్ణ, పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి అప్పలస్వామి

యలమంచిలి: ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే ప్రకటించాలని ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద సోమవారం ఆయన అధ్యక్షతన ఏఐఎస్ఏ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలస్వామి మాట్లాడుతూ డీఎస్సీ నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందా? అని రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ యువ కులంతా ఆశగా ఎదురు చూస్తున్నారన్నారు. ఎన్నికలలో కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసినట్లుగా 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ తక్షణమే ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఏడు నెలలు గడుస్తున్నా ఇంకా కాలయాపన చేయడం దేనికి అని ఆయన సూటిగా ప్రశ్నించారు. అలాగే ఎన్నికల్లో చెప్పిన విధంగా ఈ ఐదేళ్లలో 20 లక్షల మంది యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ మేరకు కార్యాచరణ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. వలంటీర్ల జీతం నెలకు రూ.10 వేలు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు ఆ హామీని నీటి పై రాతలుగా మార్చారని అప్పలస్వామి ధ్వజమెత్తారు. పూర్తిగా వలంటీర్ల వ్యవస్థని రద్దు చేసి లక్షల మందిని నిరుద్యోగులుగా మార్చారని విమర్శించారు. తక్షణమే గత ప్రభుత్వంలో పని చేసిన వలంటీర్లందరినీ భేషరతుగా విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఐఎస్ఏ పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల జోన్ అధ్యక్షులుగా పుల్లూరి రాం ప్రసాద్‌ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కె.కార్తీక్, వి.గణేష్, బి.రాజేష్, టి.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత విద్యార్థికి ఆర్థిక సాయం



కుషాల్ ఈశ్వర్ తండ్రికి ఆర్థిక సహకారం చేస్తున్న ఎస్టీయూ యలమంచిలి మండల శాఖ ఉపాధ్యాయులు

యలమంచిలి: ఎస్టీయూ యలమంచిలి మండల శాఖ ఉపాధ్యాయులు తమ మానవత్వాన్ని చాటుకున్నారు. పాలకొల్లు జీవీఎస్‌వీఆర్‌ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న కుషాల్ ఈశ్వర్ భోగి రోజున అగ్ని ప్రమాదానికి గురై భీమవరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విద్యార్థికి జరిగిన ప్రమాదం గురించి తెలుసుకున్న ఎస్టీయూ యలమంచిలి మండల శాఖ అధ్యక్షుడు రుద్రరాజు బాల విజయవర్మ తన తోటి ఉపాధ్యాయులు సుబ్బారావు, పుల్లేటికుర్తి శ్రీనివాస్‌లతో కలిసి రూ.11 వేలు విద్యార్థికి సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా జీవీఎస్ వీఆర్‌ఎం పాఠశాల హెచ్‌ఎం రాయపూడి భవాని ప్రసాద్ ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు చేగొండి సత్యనారాయణ, పోదూరు నాగరాజు, పి.శ్రీనివాస్, వి గోపి, అడ్డాల దేవేంద్రుడు పాల్గొన్నారు.

రీసర్వే డీటీగా కిషోర్



కిషోర్

నరసాపురం రూరల్: నరసాపురం మండల రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా వర్దనపు కిషోర్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇప్పటి వరకూ ఆచంట మండలంలోఎన్నికల డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తూ డిప్యూటేషన్‌పై నరసాపురం వచ్చారు. కిషోర్ గతంలో పాలకొల్లు, నరసాపురం, నల్లజర్ల, ఆచంట తదితర ప్రాంతాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. ఈ సందర్భంగా డీటీ కిషోర్ మాట్లాడుతూ మండలంలో రీసర్వే పనులు గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏల సహకారంతో సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు.

రామాంజనేయులు మాస్టారుకు అభినందనలు



రామాంజనేయరావు మాస్టారుని అభినందిస్తున్న దృశ్యం

యలమంచిలి: ఏనుగువానిలంక హైస్కూల్ కీర్తిని దక్షిణ భారతదేశ స్థాయికి తీసుకెళ్లిన పాఠశాల ఉపాధ్యాయుడు ముద్దల శ్రీరామాంజనేయరావుని సోమవారం స్కూల్‌లో హెచ్‌ఎం ఎస్ఎస్‌వీ అవధాని, సహచర ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాలలో పని చేస్తున్న సైన్స్ ఉపాధ్యాయులతో కలిసి ముద్దల శ్రీరామాంజనేయరావు తయారు చేసిన కొబ్బరి వ్యర్థాలతో విద్యుత్ తయారీ పరికరం మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి సైన్స్ ఫేర్ పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా ఎంపికై దక్షిణ భారతస్థాయి పోటీలకు వెళ్లింది. ఈ నెల 21 నుంచి 25 వరకు పాండిచ్చేరిలోని పాత ఓడరేవు వద్ద జరిగిన సదరన్ ఇండియన్ సైన్స్ ఫేర్‌లో ఈ ప్రదర్శనకు బహుమతి రాకపోయిన మారుమూల గ్రామంలోని ఒక హైస్కూల్‌లో తయారు చేసిన ప్రదర్శనను దక్షిణ భారతస్థాయికి తీసుకెళ్లడం అసమాన్యమైన విషయమని హెచ్‌ఎం అవధాని అన్నారు. ఈ సందర్భంగా ముద్దల శ్రీరామాంజనేయరావును హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు. ముద్దల శ్రీరామాంజనేయరావు మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ తయారీలో తన తోటి ఉపాధ్యాయులు ప్రోత్సాహం మరువలేనన్నారు.

పాఠశాలల్లో సామాజిక తనిఖీ సభలు



పాలకొల్లు అర్బన్: బీఆర్‌ఎంవీ మునిసిపల్ హైస్కూల్‌లో సామాజిక తనిఖీ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం



నరసాపురం రూరల్: గురుకుల పాఠశాలలో సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని బీఆర్ఎంవీ మునిసిపల్ హైస్కూల్‌లో సోమవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. అనంతరం పాఠశాల విద్యా కమిటీ, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. సామాజిక తనిఖీ సిబ్బంది ఎం.గోవింద, జి.చంద్రబాబు, బి.యోగానంద్ పాల్గొని పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం పథకం నాణ్యత, వీటికి సంబంధించిన స్టాకు రిజిస్టర్లు, పాఠశాల పనితీరు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీలో పాఠశాల హెచ్‌ఎం ఝాన్సీలక్ష్మీబాయి, ఉపాధ్యాయుడు యు.పెద్దిరాజు, తదితరులప పాల్గొన్నారు.

ఎల్బీచర్లలో..

నరసాపురం రూరల్: మండలంలోని ఎల్బీచర్ల గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలో సోమవారం సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించారు. పాఠశాలకు సంబంధించిన రికార్డులను, విద్యార్థులకు అందుతున్న భోజన సదుపాయం, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సంబంధిత రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి పాఠశాల పనితీరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ నల్లి సాయిబాబు, వైస్ ప్రిన్సిపాల్ బంగారు రాజు సమక్షంలో సామాజిక తనిఖీ సభను నిర్వహించారు.

రేపు నరసాపురం కౌన్సిల్ సాధారణ సమావేశం

నరసాపురం: నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. అజెండాలోని అంశాలతో పాటుగా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తామని పేర్కొన్నారు. సభ్యులు విధిగా హాజరుకావాలని సూచించారు.

వీవోఏల నిరాహార దీక్షలు

భీమవరం: మూడేళ్లు పూర్తయిన వీవోఏలను తొలగించేలా ప్రభుత్వం ఇచ్చిన కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న జీతాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం వెలుగు వీవోఏ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో విస్సాకోడేరు వంతెన వద్ద రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. దీక్షలను సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ డి కళ్యాణి ప్రారంభించారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయలు జయంతి



శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ శేషుబాబు

పాలకొల్లు అర్బన్: తెలుగు భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పి తెలుగు జాతికి నిండైన గౌరవాన్ని తెచ్చిన మహా చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు అని మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు అన్నారు. పాలకొల్లు గాంధీబొమ్మల సెంటర్‌లో సోమవారం శ్రీకృష్ణదేవరాయ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయలు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రంశెట్టి వెంకటరత్నం మాట్లాడుతూ రాయల వారు గొప్ప రాజనీతిజ్ఞుడని పేర్కొన్నారు. శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వంగా నరసింహరావు, ముచ్చర్ల శ్రీరామ్, ఉనికిలి శ్రీనివాస్, పెనుమాక రామమోహన్‌రావు, జక్కంపూడి కుమార్, మదన్, మండెల రజని, ఉన్నమట్ల ప్రేమ్‌కుమార్, కొట్టి భాస్కరరావు, మేడికొండ శ్రీనివాస్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



లంకలకోడేరులో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ అడ్డాల పార్వతి, ఏఓ రాజశేఖర్

పాలకొల్లు అర్బన్: మండలంలోని వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో దాళ్వా పంటకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏడీఏ అడ్డాల పార్వతి చెప్పారు. మండలంలోని సొసైటీలు, ప్రైవేట్ ఎరువుల దుకాణాలను సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే సంబంధిత ఉద్యోగులపైనా, అలాగే షాపు యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే తూకంలో కూడా తేడా వస్తే చర్యలు తప్పవన్నారు. సొసైటీల్లో యూరియా 107.855 టన్నులు, ఎంవోపీ 28.7 టన్నులు, ఎన్‌పీకే 91.65టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే ప్రైవేట్ డీలర్ల వద్ద యూరియా 62.395టన్నులు, ఎస్ఎస్‌పీ 18.2టన్నులు, ఎంవోపీ 12.05టన్నులు, డీఏపీ 11.25టన్నులు, ఎన్‌పీకే 84.4టన్నులు అందుబాటులో ఉన్నాయని పార్వతి చెప్పారు. ఆమె వెంట ఏఓ కె.రాజశేఖర్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణ శివారుకు చేరిన చిరు ‘వర్తకం’



పాలకొల్లు - నరసాపురం రోడ్డులో పండ్ల దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేసుకుంటున్న దృశ్యం



బ్రాడీపేట బైపాస్ రోడ్డులో ఆటోలో కొబ్బరి బొండాల దుకాణం ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేస్తున్న చిరు వ్యాపారి

- వినియోగదారులకు అనుకూలం
- ట్రాఫిక్ సమస్యలకు చెల్లు

పాలకొల్లు అర్బన్: చిరు వర్తకం పట్టణ శివారుకి విస్తరించింది. చెట్ల నీడ, ఆహ్లాదకర వాతావరణం, పైగా అద్దె, అడ్వాన్స్‌లు, ట్రాఫిక్ సమస్యలు ఉండకపోవడంతో పట్టణ శివారు ప్రాంతం వైపునకు చిరు వర్తకుల దృష్టి మళ్లింది. కరోనాకి ముందు చిరు వ్యాపారులు పట్టణంలోని రోడ్లపై తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగించేవారు. అయితే ట్రాఫిక్ సమస్య వినియోగదారులను వేధించేది. అయితే కరోనా తరువాత పట్టణ శివారున రోడ్డు పక్కన దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగించడంతో వినియోగదారులకు అత్యవసరమయితే తప్ప పట్టణంలోని అడుగు పెట్టే అవసరం తప్పింది. పాలకొల్లు పట్టణానికి శివారున నరసాపుర ం రోడ్డు, పూలపల్లి -భీమవరం రోడ్డు, పాలకొల్లు - మార్టేరు రోడ్డు, పాలకొల్లు - దొడ్డిపట్ల రోడ్డులో చిరు వర్తకలు తమ వ్యాపారాలు కొనసాగిస్తూ ఉపాధి పొందుతున్నారు. పండ్ల దుకాణాలు, కాయగూరలు, చికెన్, చేపలు, పూల మొక్కల దుకాణాలు, బట్టలు, స్వీట్లు, తిను బండారాలు ఇలా అన్ని రకాల వ్యాపారాలు పట్టణ శివారున అందుబాటులో ఉంటున్నాయి. అలాగే గ్రామాల నుంచి పట్టణానికి వచ్చే ప్రజలు కూడా అందుబాటు ఉన్న దుకాణాల నుంచి తమకు కావాల్సిన నిత్యావసరాలు కొనుగోలు చేసుకుంటున్నారు.

ట్రాఫిక్ సమస్యలు తప్పాయి



గతంలో ఏ చిన్న వస్తువు కొనుగోలు చేయాలన్నా పాలకొల్లు పట్టణంలోకి వెళ్లాలి. దీంతో మోటార్ సైకిల్ పార్కింగ్ సమస్యతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు తీవ్రంగా ఎదుర్కొనేవాళ్లం. పట్టణ శివారులో చిరు వర్తకాలు ఏర్పాటు చేయడం వలన వినియోగదారులకు సౌలభ్యంగా ఉంది. ముఖ్యంగా ట్రాఫిక్ సమస్యలు తప్పాయి.

– కాసా విజయ దుర్గా భవాని, ఎల్అండ్‌టీ, పెంకుళ్లపాడు

బస్టాండ్‌లో ఉచిత మరుగు వసతి కల్పించాలి

నరసాపురం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు ఉచిత మరుగు వసతి కల్పించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎం.త్రిమూర్తులు కోరారు. ఈ మేరకు సోమవారం అసిస్టెంట్ మేనేజర్ ఎన్ సురేంద్రవర్మకు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ నరసాపురం బస్టాండ్‌లో టాయిలెట్స్ వినియోగిస్తే దారుణంగా రూ.10 వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు యూరిన్‌కి వెళ్లినా కూడా రూ.10 వసూలు చేస్తున్నారని, ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించకుండా ఇలా దోపిడీ చేయడం ఏంటి? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు పాగాకు నారాయణరావు,కె.వెంకటేశ్వరరావు, బూడిద జోగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా నేషనల్ ఎలక్ట్రీషియన్స్ డే

భీమవరం: స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో సోమవారం నేషనల్ ఎలక్ట్రీషియన్స్ డే వేడుకలు నిర్వహించారు. ముందుగా విద్యుత్ బల్బును కనుగొన్న శాస్త్రవేత్త థామస్ అల్వా ఎడిసన్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మెంటే పార్థసారథి మాట్లాడుతూ మానవాళికి వెలుగును చూపించిన శాస్త్రవేత్త థామస్ అల్వా ఎడిసన్‌ను స్మరించుకోవడం మన బాధ్యతని అన్నారు. ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అంబళ్ళ శ్రీనివాసరావు, కింతాడ కృష్ణమోహన్ మాట్లాడుతూ వృద్ధాప్యానికి చేరుకున్న సీనియర్ ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లను ఆదుకుంటామని తెలిపారు. జిల్లా లేబర్ అసిస్టెంట్ కమిషనర్ టీవీవీ ఆదినారాయణమూర్తి, లేబర్ ఆఫీసర్ ఎం కిరణ్‌కుమార్ కార్మికుల చట్టంపై అవగాహన కలిగించారు.